సాక్షి
తూర్పుగోదావరి

సోమవారం । 1 । జూలై । 2024



రూ.35 వేల విరాళం

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి వారి నిత్యాన్నదాన ట్రస్టుకు దిగుమర్తి శ్రీనివాస్, పద్మావతి దంపతులు (కాకినాడ) ఆదివారం రూ.35 వేల విరాళం సమర్పించారు.



అన్నదాన భవనానికి రూ.1,00,116

ఆత్రేయపురం: వాడపల్లి వేంకటేశ్వరస్వామి క్షేత్రంలో అన్నదాన భవన నిర్మాణానికి కర్రి ఊగంటేశ్వరరావు దంపతులు (విశాఖపట్నం) ఆదివారం రూ.1,00,116 విరాళం సమర్పించారు.

తరగతి గది.. విజ్ఞాన నిధి



సపోర్టింగ్ ఆంధ్రాస్ లెర్నింగ్ ట్రాన్స్‌ఫర్మేషన్ (సాల్ట్) ప్రాజెక్టు నిర్వహణలో భాగంగా ఎస్‌సీఈఆర్‌టీ, సమగ్ర శిక్ష సంయుక్త ఆధ్వర్యాన టీచ్ టూల్ పేరుతో ప్రధానోపాధ్యాయులు/స్కూల్ అసిస్టెంట్లు/ఎస్‌జీటీ/సీఆర్‌ఎంటీలకు శిక్షణ ఇస్తున్నారు.

- 8లో

న్యూస్‌రీల్

పొగాకు బోర్డు రీజినల్ మేనేజర్‌గా ప్రసాద్



దేవరపల్లి: పొగాకు బోర్డు రాజమహేంద్రవరం రీజినల్ మేనేజర్‌గా జీఎల్‌కే ప్రసాద్ నియమితులయ్యారు. ఈ మేరకు బోర్డు ప్రధాన కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన సోమవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. ఇప్పటి వరకూ రీజినల్ మేనేజర్‌గా పని చేసిన ఎం.ఆదిశేషయ్య ఆదివారం ఉద్యోగ విరమణ చేశారు. ఆయన స్థానంలో దేవరపల్లి పొగాకు వేలం కేంద్రం నిర్వహణాధికారి ప్రసాద్‌ను ఇన్‌చార్జిగా నియమించారు. ప్రసాద్ 2022–23లో కొంత కాలం రాజమహేంద్రవరం ఇన్‌చార్జి రీజినల్ మేనేజర్‌గా పని చేశారు.

తాళ్లపూడిలో అత్యధిక వర్షపాతం



కొవ్వూరు కోర్టు ప్రాంగణంలో రోడ్డుపై నిలిచిపోయిన వర్షపు నీరు

కొవ్వూరు: అల్పపీడనం, ఉపరితల ఆవర్తన ద్రోణి ప్రభావంతో ఆదివారం ఉదయం 8.30 గంటలతో ముగిసిన 24 గంటల వ్యవధిలో జిల్లావ్యాప్తంగా 20.7 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. తాళ్లపూడిలో అత్యధికంగా 56.2 మిల్లీమీటర్లు రికార్డయ్యింది. సీతానగరం 51.6, ఉండ్రాజవరం 34.8, పెరవలి 28.4, రాజానగరం 28, నల్లజర్ల 24, రంగంపేట 23.2, చాగల్లు 18.4, నిడదవోలు 16.8, దేవరపల్లి, గోపాలపురం, అనపర్తి మండలాల్లో 15.2, కొవ్వూరు 14.6, రాజమహేంద్రవరం అర్బన్ 13, రాజమహేంద్రవరం రూరల్ 10.6, కడియం 10.4 మిల్లీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది. బిక్కవోలు, గోకవరం, కోరుకొండ మండలాల్లో జల్లులు కురిశాయి.

'కొమ్ముల'కు బాల సాహిత్య పురస్కారం



కొమ్ముల వెంకట సూర్యనారాయణ

రాజమహేంద్రవరం రూరల్: జిల్లా ప్రభుత్వ విద్యా శిక్షణ సంస్థ (డైట్) సీనియర్ లెక్చరర్ కొమ్ముల వెంకట సూర్యనారాయణ రచించిన బాలల కథా సంపుటి 'బాల కథా చంద్రిక' శ్రీమక్కెన రామసుబ్బయ్య ఫౌండేషన్ బాల సాహిత్య పురస్కారం–2024కు ఎంపికైంది. విజయవాడకు చెందిన శ్రీ మక్కెన రామసుబ్బయ్య ఫౌండేషన్ నిర్వాహకుడు డాక్టర్ మక్కెన శ్రీను ఈ విషయం తెలిపారు. ఈ నెలలో విజయవాడలో జరిగే ఫౌండేషన్ పదో సాహిత్య పురస్కారాల ప్రదాన సభలో కొమ్ములకు రూ.7 వేల నగదు, జ్ఞాపిక, ప్రశంసా పత్రం అందజేస్తామన్నారు. కొమ్ములను డైట్ ప్రిన్సిపాల్ ఏఎం జయశ్రీ, లెక్చరర్లు అభినందించారు.

సీపెట్ డిప్లొమా కోర్సులలో ప్రవేశానికి అవకాశం

నల్లజర్ల: విజయవాడలోని సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రో కెమికల్స్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ(సీపెట్)లో డిప్లొమా కోర్సులలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. పదో తరగతి సప్లిమెంటరీలో పాసైన వారికి ఉద్యోగ కల్పనే లక్ష్యంగా డిప్లొమా ఇన్ ప్లాస్టిక్ టెక్నాలజీ (డీపీటీ), డిప్లొమా ఇన్ ప్లాస్టిక్ మౌల్డ్ టెక్నాలజీ (డీపీఎంటీ) కోర్సులలో ప్రవేశానికి ప్రత్యేక అవకాశం కల్పిస్తున్నారు. ఈ కోర్సుల కాల వ్యవధి మూడేళ్లని సీపెట్ జాయింట్ డైరెక్టర్, హెడ్ సీహెచ్ చంద్రశేఖర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థినీ విద్యార్థులకు సంస్థ ప్రాంగణంలోనే విడివిడిగా హాస్టల్ వసతి ఉందన్నారు. నిబంధనలను అనుసరించి అర్హులైన వారికి రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇస్తుందన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ నెల ఏడో తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కోర్సులు పూర్తి చేసిన వారికి ప్లాస్టిక్ రంగంలోని బహుళజాతి సంస్థలు, అనుబంధ సంస్థల్లో జూనియర్ ఇంజినీర్, మౌల్డ్ డిజైనర్, మేకర్, జూనియర్ ఇంజినీర్ (మెయింటెనెన్స్) వంటి ఉద్యోగాలు లభిస్తాయని వివరించారు. ప్రారంభ వేతనం రూ.16 వేల నుంచి రూ.20 వేల వరకూ ఉంటుందన్నారు. ఈ కోర్సులు పూర్తి చేయడం ద్వారా సాధారణ విద్యార్థులు కూడా మెరుగైన జీవితాన్ని అందుకోవచ్చని తెలిపారు. దరఖాస్తు విధానం, ఇతర సహాయం కోసం 93980 50255 సెల్ నంబర్‌లో సంప్రదించాలని చంద్రశేఖర్ కోరారు.

ఆర్‌డబ్ల్యూఎస్ ఇన్‌చార్జి ఎస్‌ఈగా సత్యనారాయణ

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): ఆర్‌డబ్ల్యూఎస్ జిల్లా ఇన్‌చార్జి ఎస్‌ఈగా ఎన్‌వీవీ సత్యనారాయణ నియమితులయ్యారు. ఇప్పటి వరకూ ఈ స్థానంలో పని చేసిన మలిశెట్టి శ్రీనివాస్ ఉద్యోగ విరమణ చేశారు. ఆయన స్థానంలో ఏలూరు జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈగా పని చేస్తున్న సత్యనారాయణకు అదనపు బాధ్యతలు అప్పగించారు.

బంగారు కలలు..
పండించుకునే వేళాయె..

- ఇంజినీరింగ్ కోర్సుల ప్రవేశాలకు షెడ్యూల్ విడుదల
- నేటి నుంచి ఈఏపీ సెట్ వెబ్ కౌన్సెలింగ్
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- కాకినాడలో రెండు హెల్ప్‌లైన్ కేంద్రాలు
- జాగ్రత్తలు తీసుకోవాలంటున్న విద్యావేత్తలు



బాలాజీచెరువు (కాకినాడ సిటీ): విద్యార్థులు తమ తలరాతలను నిర్దేశించుకునే సమయం ఆసన్నమైంది. ఇంజినీరింగ్ కళాశాలల్లో చేరికలకు వేళయ్యింది. దీనికి సంబంధించిన కౌన్సెలింగ్ షెడ్యూల్ నోటిఫికేషన్‌ను రాష్ట్ర సాంకేతిక విద్యా శాఖ ఇప్పటికే విడుదల చేసింది. దీంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో హడావుడి మొదలైంది. గత ఏడాది ఇంజినీరింగ్ కోర్సుల అడ్మిషన్ షెడ్యూల్ జూలై 20న ప్రారంభమైంది. ఈసారి విద్యా సంవత్సరం క్రమపద్ధతిలో కొనసాగేందుకు వీలుగా గత ప్రభుత్వ నిర్ణయం మేరకు 20 రోజులు ముందుగానే షెడ్యూల్ ప్రకటించారు. దీనికి తగినట్టుగానే రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఇంజినీరింగ్ కళాశాలల్లో సీట్ల సంఖ్య, కోర్సులు తదితర వివరాలు సిద్ధం చేసింది. కౌన్సెలింగ్ సోమవారం నుంచి నిర్వహిస్తారు. అన్ని ప్రక్రియలూ పూర్తి చేసి, ఈ నెల 19వ తేదీన తరగతులు ప్రారంభించాలని నిర్ణయించారు. కౌన్సెలింగ్, అడ్మిషన్ల ప్రక్రియ విజయవంతంగా సాగేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశారు. ఏ కోర్సు ఎంపిక చేసుకోవాలి, ఏ కళాశాలలో చేరాలనే అంశాలపై విద్యార్థులు ఇప్పటికే ఒక నిర్ణయానికి వచ్చారు. తద్వారా ఇన్నాళ్లుగా తాము కంటున్న కలలు పండించుకోవాలని, బంగారు భవిష్యత్తును అందుకోవాలని ఆకాంక్షిస్తున్నారు. ఇటువంటి కీలక తరుణంలో విద్యార్థులు, తల్లిదండ్రులు వెబ్ ఆప్షన్లపై పూర్తి స్థాయిలో ఆలోచించుకుని తుది నిర్ణయం తీసుకోవాలని విద్యా రంగ నిపుణులు సూచిస్తున్నారు.

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఇంజినీరింగ్ కళాశాలలు, సీట్ల వివరాలు

ప్రభుత్వ కళాశాలలు 2 (జేఎన్‌టీయూ – కాకినాడ, ఆదికవి నన్నయ యూనివర్సిటీ – రాజానగరం)

సీట్లు	950
ప్రైవేటు కళాశాలలు	32
సీట్లు	15,400
మొత్తం సీట్లు	16,350
ఈఏపీ సెట్‌లో అర్హత పొందిన వారు	14,250

అందుబాటులోకి కొత్త కోర్సులు

అంతర్జాతీయంగా ఇంజినీరింగ్ రంగం నానాటికీ కొత్త పుంతలు తొక్కుతోంది. అనేక నూతన ఆవిష్కరణలు జరుగుతున్నాయి. సరికొత్త ఆలోచనలకు మేధావులు ఊపిరి పోస్తున్నారు. దీనికి అనుగుణంగానే ఇంజినీరింగ్ విద్యలో కూడా అనేక కొత్త కోర్సులు అందుబాటులోకి వచ్చాయి. ఈసీఈ, మెకానికల్, ఈఈఈ, సీఎస్‌ఈ, సివిల్ వంటి సంప్రదాయ కోర్సులు ఇప్పటికే ఉన్నాయి. కొత్తగా సీఎస్‌ఈలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), మెషీన్ లెర్నింగ్, డేటా సైన్స్, రోబోటిక్స్, సైబర్ సెక్యూరిటీ, వెరీ లార్జ్ స్కేల్ ఇంటిగ్రేషన్ (వీఎల్‌ఎస్‌ఐ) డిజైన్, అడ్వాన్స్‌డ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ, ఏరోస్పేస్, అగ్రికల్చరల్, మెరైన్, మైనింగ్, స్కిల్ అండ్ టెక్స్‌టైల్ వంటి కొత్త బ్రాంచిలు వచ్చాయి. సంప్రదాయ కోర్సుల మాదిరిగానే నైపుణ్యంతో కూడిన ఈ కొత్త కోర్సులు చదివిన వారికి కూడా జీవితంలో ఉన్నతంగా స్థిరపడటానికి అపార అవకాశాలు లభిస్తాయి.

ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ఇలా..

- cets.apsche.ap.gov.in-24 వెబ్‌సైట్‌లోకి వెళ్లి, అడ్మిషన్‌పై క్లిక్ చేయాలి. అందులో వచ్చిన ఫామ్‌లో హాల్ టికెట్ నంబర్, పుట్టిన తేదీ నమోదు చేస్తే రిజిస్ట్రేషన్ ఫామ్ వస్తుంది. అందులో అడిగిన సమాచారం క్షుణ్ణంగా నింపి సబ్‌మిట్ చేయాలి.
- పదో తరగతి, ఇంటర్మీడియెట్ మార్కుల జాబితాలు, 6 నుంచి ఇంటర్ వరకూ స్టడీ, టీసీ, కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలు, ర్యాంక్ కార్డు, హాల్ టికెట్, రేషన్ కార్డు అప్‌లోడ్ చేయాలి.
- ఈడబ్ల్యూఎస్ కుల ధ్రువీకరణ పత్రం ఉన్న వారికి 2022 నుంచి 10 శాతం రిజర్వేషన్ అమలు చేస్తున్నారు.

ఇదీ షెడ్యూల్

- జూలై 1 నుంచి 7: ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపు.
- జూలై 4 నుంచి 10: ఆన్‌లైన్ సర్టిఫికెట్ల పరిశీలన.
- జూలై 8 నుంచి 12: వెబ్ ఆప్షన్లు.
- జూలై 13: వెబ్ ఆప్షన్లు మార్చుకునేందుకు అవకాశం.
- జూలై 16: సీట్ల కేటాయింపు.
- జూలై 17 – 22: కళాశాలలో ప్రవేశాలు.
- జూలై 19: తరగతులు ప్రారంభం.

జిల్లాలో హెల్ప్‌లైన్ కేంద్రాలు

- జేఎన్‌టీయూ – కాకినాడ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ బ్లాక్
- ఆంధ్రా పాలిటెక్నిక్ కళాశాల, జగన్నాథపురం, కాకినాడ

కౌన్సెలింగ్‌లో అప్రమత్తత అవసరం



రిజిస్ట్రేషన్ నుంచి ఆన్‌లైన్ ఫీజు చెల్లింపు, కళాశాల, కోర్సు ఎంపిక వంటి అంశాల్లో అన్నీ విద్యార్థులు, వారి తల్లిదండ్రులే స్వయంగా చూసుకోవాలి. అలా కాదని స్నేహితులు లేదా ఇతరుల ద్వారా ఆన్‌లైన్ కౌన్సెలింగ్ ప్రక్రియ చేయించుకుంటే ఏవైనా పొరపాట్లు జరిగితే ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ఒక్కోసారి కోరుకున్న చదువు దూరమయ్యే పరిస్థితులు కూడా ఎదురు కావచ్చు. విద్యార్థి అభీష్టం మేరకు కళాశాల, కోర్సు ఆప్షన్లను కొన్ని ప్రైవేటు కళాశాలల సిబ్బందే స్వయంగా ఎంపిక చేస్తున్నారు. అయినప్పటికీ విద్యార్థి అన్నీ క్షుణ్ణంగా పరిశీలించుకోవాలి. కౌన్సెలింగ్ దశ చాలా కీలకం కాబట్టి విద్యార్థులు తమ ర్యాంకును బట్టి మంచి కళాశాలను ఎంపిక చేసుకుని అడ్మిషన్ పొందాలి. వెబ్ కౌన్సెలింగ్ అనేది విద్యార్థుల స్వీయ పర్యవేక్షణలో జరుగుతుంది కాబట్టి ఏం జరిగినా వారే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుంది.

– సీహెచ్ సాయిబాబు, డైరెక్టర్ ఆఫ్ అకడమిక్ ఆడిట్, జేఎన్‌టీయూ, కాకినాడ

ఆసక్తి ఉన్న బ్రాంచినే ఎంచుకోవాలి



విద్యార్థులు కళాశాలలకు తొలి ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు ఆసక్తి ఉన్న బ్రాంచినే ఎంచుకుని, అందులో ప్రతిభ చూపాలి. ముఖ్యంగా ఒకే కోర్సుకు డిమాండ్ ఉందనే భావన నుంచి బయటపడాలి. అందుబాటులో ఉన్న కోర్సులకు బయటి పరిశ్రమల్లో ఉన్న ఉపాధి అవకాశాలు, భవిష్యత్తులో వాటికి ఉన్న డిమాండ్ తదితర అంశాలపై విద్యావేత్తల అభిప్రాయాలు తెలుసుకోవాలి. ఆమేరకు బ్రాంచి ఎంచుకోవాలి. ఒకే కోర్సులో అందరూ చేరడం ఏమాత్రం సరైన పద్ధతి కాదు. ఇటీవల సాఫ్ట్‌వేర్‌కు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. తద్వారా సీఎస్‌ఈ కోర్సు ఒక్కటే ముఖ్యమైనది కాదన్నది గుర్తించాలి. అభివృద్ధి అనేది కేవలం ఒక్క రంగంతోనే సాధ్యపడదు. ముఖ్యంగా ఆన్‌లైన్ కౌన్సెలింగ్‌కు కావలసిన అన్ని పత్రాలూ సరి చూసుకోవాలి. ఈడబ్ల్యూఎస్‌కు గత ప్రభుత్వం 10 శాతం కోటా ప్రారంభించింది. అర్హత ఉన్న ప్రతి విద్యార్థీ దీనిని వినియోగించుకోవాలి.

– డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు, ఉప కులపతి, జేఎన్‌టీయూ–కాకినాడ

డయేరియా నియంత్రణకు పటిష్ట కార్యాచరణ

- అధికారులకు కలెక్టర్ ప్రశాంతి ఆదేశం
- అచ్యుతాపురంలో పర్యటన



అచ్యుతాపురంలో పర్యటిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

రంగంపేట: జిల్లాలో డయేరియా నియంత్రణకు పటిష్ట కార్యాచరణ ప్రణాళిక అమలు చేయాలని వైద్య, ఆరోగ్య శాఖ, సమన్వయ శాఖల అధికారులను కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. రంగంపేట మండలం ఈలకొలను సచివాలయం పరిధిలోని అచ్యుతాపురం గ్రామాన్ని ఆదివారం ఆమె సందర్శించారు. డయేరియా బారిన పడి కోలుకున్న వారిని ఇళ్లకు వెళ్లి పరామర్శించారు. వారికి సకాలంలో మందులు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారిని ఆదేశించారు. అనంతరం గ్రామంలోని ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, మంచినీటి ఓవర్ హెడ్ ట్యాంక్, పైప్‌లైన్లను కలెక్టర్ పరిశీలించారు. తాగునీటి ట్యాంకులను తప్పనిసరిగా క్లోరినేషన్ చేయాలని గ్రామ పంచాయతీ అధికారులను ఆదేశించారు. అచ్యుతాపురం చుట్టుపక్కల 6 గ్రామాల్లో తాగునీటి సమూనాలు సేకరించి, పరీక్షలు నిర్వహించాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు సూచించారు. గ్రామాల్లో మురుగునీరు నిల్వ ఉండకుండా చూడాలని, పారిశుధ్యం మెరుగుపరిచేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. గ్రామంలో మరో వారం రోజుల పాటు వైద్య శిబిరం నిర్వహించాలని వైద్య, ఆరోగ్య అధికారులకు సూచించారు.

జిల్లాలో డయేరియా కేసులు నమోదు కాకుండా, నియంత్రణే లక్ష్యంగా సమన్వయ శాఖల అధికారులు పని చేయాలని కలెక్టర్ ప్రశాంతి ఆదేశించారు. ఏ ఒక్కరూ డయేరియా బారిన పడకుండా సోమవారం నుంచి ఆగస్టు 31 వరకూ రెండు నెలల పాటు నిర్వహించే స్టాప్ డయేరియా ప్రచార కార్యక్రమం ద్వారా అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. గ్రామాలు, పట్టణాల్లోని అన్ని మంచినీటి ట్యాంకులను శుభ్రం చేయాలని ఆదేశించారు. అన్ని ప్రభుత్వాసుపత్రుల్లో డయేరియా మందులతో పాటు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు సిద్ధంగా ఉంచాలని సూచించారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని కోరారు. డయేరియా లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని, ముఖ్యంగా ఐదేళ్ల లోపు పిల్లల ఆరోగ్యంపై తగినంత జాగ్రత్త తీసుకోవాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, ఆర్‌డీఓ ఎ.చైత్రవర్షిణి, జిల్లా సర్వే అధికారి డాక్టర్ రాజీవ్, డీఎల్‌పీఓ నాగలత, తహసీల్దార్ లతీఫ్ పాషా, ఎంపీడీఓ బి.శ్రీరామరాజు, పీహెచ్‌సీ వైద్యులు వేణు, శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేడు పింఛన్ల పంపిణీ

- జిల్లాలో 2,44,302 మందికి రూ.165.13 కోట్ల అందజేత
- మంత్రి కందుల దుర్గేష్



నిడదవోలు: ఎన్‌టీఆర్ భరోసా పెన్షన్ కింద లబ్ధిదారులకు రూ.4 వేల పింఛనుతో పాటు ఏప్రిల్, మే, జూన్‌కు సంబంధించి నెలకు రూ.వెయ్యి చొప్పున వారి ఇళ్ల వద్దనే అందిస్తామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. నిడదవోలులో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని రకాల ఫింఛన్లు సోమవారమే అందించేందుకు చర్యలు చేపట్టామని, ఏవైనా కొన్ని మిగిలితే మర్నాడు అందిస్తామని తెలిపారు. పోలవరం ప్రాజెక్టు పనులు 2029 నాటికి పూర్తయ్యేలా ప్రభుత్వం చర్యలు చేపడుతుందని చెప్పారు. నిడదవోలులోని సామాజిక ఆసుపత్రిని 30 పడకల నుంచి 100 పడకలకు విస్తరిస్తామన్నారు. గోదావరి జలాలు అందించడం ద్వారా పట్టణ తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతామని తెలిపారు. నియోజకవర్గంలో రోడ్లు, డ్రైన్ల అభివృద్ధిపై సంబంధిత మంత్రులతో చర్చించామని తెలిపారు. జిల్లాలో పర్యాటకాభివృద్ధికి చాలా అవకాశాలున్నాయని చెప్పారు. ఇటీవలనే పాపికొండల విహార యాత్ర ప్రారంభమైందని, పర్యాటకులకు ఎటువంటి ఇబ్బందులూ లేకుండా భద్రతా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి దుర్గేష్ తెలిపారు.

పింఛన్ల పంపిణీకి 4,092 మంది సిబ్బంది

సీటీఆర్‌ఐ (రాజమహేంద్రవరం): జిల్లా వ్యాప్తంగా లబ్ధిదారులకు ఇళ్ల వద్ద పింఛన్లు పంపిణీ చేసేందుకు 4,092 మంది సిబ్బందిని నియమించామని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వీరిలో 3,905 మంది సచివాలయ, 187 మంది ఇతర శాఖల సిబ్బంది ఉన్నారని తెలిపారు. పింఛన్ల పంపిణీకి ఉదయం 5 గంటలకే సిబ్బంది సన్నద్ధంగా ఉండాలని ఆదేశించారు. లబ్ధిదారులకు ముఖ్యమంత్రి లేఖ అందజేసి, నగదు ముట్టినట్లు రశీదు తీసుకోవాలని అన్నారు.

వైద్యారోగ్యంలో ఇదేం చోద్యం?

- రెండేళ్ల శిక్షణ తర్వాత పాత చోటే పోస్టింగ్!
- జీఎన్‌ఎం శిక్షణ పూర్తయ్యాక పూర్వపు విధుల్లో చేరాలని ఆదేశాలు
- ఆందోళన చెందుతున్న 312 మంది ఏఎన్‌ఎంలు
- నేడు గ్రామ సచివాలయాల్లో బాధ్యతల స్వీకరణ



కాకినాడ సామాన్య ప్రభుత్వ ఆస్పత్రిలో సేవలను అందిస్తున్న జీఎన్‌ఎం

ఆలమూరు: వైద్య, ఆరోగ్య శాఖను మరింత పటిష్ఠపరచేందుకు, ప్రకృతి విపత్తుల్లో అవసరమైన వైద్యసేవలను అందించేందుకు ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గ్రామ సచివాలయాల్లో పనిచేసే ఏఎన్‌ఎంలకు జీఎన్‌ఎం (జనరల్ మెడిసిన్ అండ్ మిడ్‌వైఫరీ)గా శిక్షణను ఇచ్చేందుకు ఎంపిక చేసింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా ఉన్న 1,590 గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో అర్హత, ఆసక్తి కలిగిన 312 మంది ఏఎన్‌ఎంలను జీఎన్‌ఎంలుగా శిక్షణ పొందేందుకు ఎంపిక చేశారు. జిల్లా వైద్యారోగ్యశాఖ ఉత్తర్వుల మేరకు కాకినాడ, రాజమహేంద్రవరం ప్రభుత్వ సామాన్య ఆస్పత్రుల్లో ఏఎన్‌ఎంలు ప్రభుత్వ ఖర్చుతో రెండేళ్ల పాటు శిక్షణను పూర్తి చేసుకున్నారు. వీరు జీఎన్‌ఎం శిక్షణ పొందుతూ ఆయా ఆస్పత్రుల్లో వైద్యారోగ్య సేవలను అందించారు. 2021 ఏప్రిల్ ఒకటో తేదీన శిక్షణకు ప్రవేశం పొందగా 2023 మార్చి 31 నాటికి శిక్షణ పూర్తయ్యింది. అప్పటికే సార్వత్రిక ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో జీఎన్‌ఎం శిక్షణ గడువును మరో మూడు నెలలు పొడిగించారు. దీంతో 27 నెలల పాటు శిక్షణ పొందుతూ సేవలను అందించిన ఏఎన్‌ఎంలు తమకు పదోన్నతులు కల్పిస్తారనే ఆశతో ఉన్నారు. ఈ నేపథ్యంలో జీఎన్‌ఎం శిక్షణ పొందిన ఏఎన్‌ఎం విధుల గురించి కొత్తగా బాధ్యతలు స్వీకరించిన టీడీపీ ప్రభుత్వం విధి విధానాలను జారీ చేసింది. జీఎన్‌ఎం శిక్షణ పూర్తి చేసుకున్న ఏఎన్‌ఎంలందరూ గతంలో పనిచేసిన గ్రామ సచివాలయాలకు వెళ్లి పూర్వపు బాధ్యతలు స్వీకరించాలని ఆదేశాలు జారీ చేసింది. జీఎన్‌ఎం శిక్షణతో పాటు రాత పరీక్షలు పూర్తయినందున సంబంధిత సర్టిఫికెట్లు రాగానే ఏఎన్‌ఎంలపై ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకుంటుందని భావిస్తున్నారు.

స్పష్టమైన హామీ లేకుండానే ఏఎన్‌ఎంలకు ఆదేశాలు జారీ

రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇవ్వకుండానే ఇప్పటికే జీఎన్‌ఎంలుగా శిక్షణ పొందిన ఏఎన్‌ఎంలు అందరూ సోమవారం గ్రామ సచివాలయాల్లో పూర్వపు విధుల్లోకి తిరిగి చేరాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆదేశాలు జారీ చేసింది. కాకినాడలోని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ప్రధాన కార్యాలయంలో రిలీవ్ ఆర్డర్ తీసుకుని సత్వరమే ఆయా మండల ప్రజా పరిషత్ కార్యాలయాలు, పీహెచ్‌సీల్లో రిపోర్టు చేసి సంబంధిత గ్రామ సచివాలయాల్లో బాధ్యతలు స్వీకరించాలని ప్రభుత్వం ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది. దీంతో గత రెండేళ్ల నుంచి అహర్నిశలు శ్రమించి శిక్షణ పొందిన ఏఎన్‌ఎంలు మళ్లీ గ్రామస్థాయిలో అదే సేవలను అందించవలసిన పరిస్థితి ఏర్పడింది. అందులో భాగంగా ఇప్పటికే శిక్షణ పొందిన జీఎన్‌ఎంలు అందరూ జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు హడావుడిగా గ్రామ సచివాలయాల్లో చేరేందుకు సిద్ధపడుతున్నారు. దానికనుగుణంగా జిల్లాలోని వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో విధుల నుంచి వైదొలిగిన గ్రామ సచివాలయాల్లో మళ్లీ తిరిగి పోస్టింగ్ ఇచ్చేందుకు వైద్యాధికారులు మార్గం సుగమం చేశారు.

భవిష్యత్‌పై ఏఎన్‌ఎంల ఆందోళన?

అప్పటి రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు 27 నెలల పాటు తీవ్రంగా శ్రమించి వ్యయ ప్రయాసల కోర్చి జీఎన్‌ఎంలుగా శిక్షణ పొందినా మళ్లీ గ్రామ సచివాలయాలకే పరిమితం చేయడంపై ఏఎన్‌ఎంలలో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. శిక్షణ పూర్తి చేసుకున్న రెండేళ్ల తరువాత జీఎన్‌ఎంగా పోస్టింగ్‌కు అవకాశం కల్పిస్తామని ఎంపిక సమయంలోనే అప్పటి జిలా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు హామీ ఇచ్చారని ఏఎన్‌ఎంలు చెబుతున్నారు. గత ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు శిక్షణ పొందిన ఏఎన్‌ఎంలకు జీఎన్‌ఎంలుగా పదోన్నతులు కల్పించి ప్రభుత్వ ఆస్పత్రుల్లో నియమించి తగిన జీతభత్యాలు అందించి శ్రమకు తగిన ప్రతిఫలాన్ని అందించాలని వారు కోరుతున్నారు.

పూర్వపు విధుల్లోకి హాజరు కావాలి



జిల్లాలోని ప్రధాన ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఇప్పటికే జీఎన్‌ఎంలుగా శిక్షణ పొందిన గ్రామ సచివాలయ ఏఎన్‌ఎంలను మళ్లీ పూర్వపు విధుల్లోకి చేర్చుకోవాలని ఆదేశాలు అందాయి. దీంతో డివిజన్ పరిధిలో శిక్షణకు వెళ్లి, పూర్తి చేసుకున్న వారందరూ ఖాళీగా ఉన్న గత ఏఎన్‌ఎం పోస్టుల్లో జాయిన్ కావాలి.

– ఎం.సుమలత, జిల్లా అదనపు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి, కొత్తపేట

డయేరియాతో ఏడుగురికి అస్వస్థత



గుడ్డిగూడెం వైద్య శిబిరంలో రోగులను పరిశీలిస్తున్న డాక్టర్లు

గోపాలపురం: మండలంలోని గుడ్డిగూడెం, కోమటికుంట గ్రామాల్లో డయేరియాతో ఏడుగురు వ్యక్తులు ఆసుపత్రి పాలయ్యారు. హుకుంపేట పీహెచ్‌సీ వైద్యుడు కె.శ్రీనివాస్ కథనం ప్రకారం.. గుడ్డిగూడెంలో ఆరుగురు శనివారం ఉదయం చెడిపోయిన చేపలు తిన్నారు. అనంతరం వాంతులు, విరేచనాలతో అస్వస్థతకు గురయ్యారు. వారికి గుడ్డిగూడెంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి, ప్రథమ చికిత్స అందించారు. పరిస్థితి ఇబ్బందికరంగా ఉండటంతో వారిలో ముగ్గురిని గోపాలపురం సీహెచ్‌సీకి తరలించారు. వారిలో ఒకరి ఆరోగ్య పరిస్థితి విషమించడంతో రాజమహేంద్రవరం తరలించారు. కోమటికుంట గ్రామంలో ఆదివారం ఉదయం పోశిబోయిన రవి అనే వ్యక్తికి వాంతులు, విరేచనాలు అయ్యాయి. అతడిని స్థానిక ఏఎన్‌ఎం కె.భూలక్ష్మి గోపాలపురం ఆసుపత్రికి తరలించారు. గుడ్డిగూడెం, కోమటికుంట గ్రామాల్లో ఆయా కార్యదర్శులు పారిశుధ్య పనులు చేపట్టారు. డయేరియా ప్రబలిన నేపథ్యంలో కొవ్వూరు డివిజనల్ పంచాయతీ అధికారి, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి సోమవారం ఆయా గ్రామాల్లో పర్యటించనున్నారని డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు.

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో కానిస్టేబుల్ కుమారుడి మృతి


విజయ్‌కిరణ్ (ఫైల్)

కాకినాడ క్రైం: విద్యుదాఘాతంతో ఓ కానిస్టేబుల్ కుమారుడు మృతి చెందాడు. కాకినాడలోని శ్రీరాంనగర్‌కు చెందిన పంపనబోయిన విజయ కిరణ్(19) స్థానిక కైట్ ఇంజినీరింగ్ కాలేజీలో తొలి ఏడాది బీటెక్ చదువుతున్నాడు. ఇంట్లో ఫైబర్ నెట్‌తో అనుసంధానం అయిన ఓ వైరు వేలాడుతుండగా గమనించి ప్లాస్టిక్ స్టూల్ సాయంతో సర్దాడు. తర్వాత కాసేపటికి వేలాడుతున్న ఆ వైర్‌ను కత్తెరతో కత్తిరించే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలో విద్యుదాఘాతానికి గురయ్యాడు. గమనించిన సోదరి.. కుటుంబ సభ్యులకు తెలపడంతో వారు తక్షణమే కాకినాడ అపోలో ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే విజయకిరణ్ మృతి చెందినట్టు నిర్ధారించారు. యువకుడి తండ్రి చక్రధర్ కాకినాడ టూ టౌన్ ట్రాఫిక్ విభాగంలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. సోదరి జేఎన్‌టీయూలో ఇంజినీరింగ్ మూడవ సంవత్సరం చదువుతోంది. ఒక్కగానొక్క కొడుకు ప్రమాదం బారినపడి ప్రాణాలు కోల్పోవడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. కుమారుడి మరణ వార్త విన్న చక్రధర్ అపస్మారక స్థితికి చేరుకోగా ఆయనను ఆసుపత్రికి తరలించారు. కాకినాడ టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. యువకుడి అంత్యక్రియలను స్వస్థలం తుని సమీపంలోని చేపూరులో నిర్వహించారు. అంత్యక్రియలలో పోలీస్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలు..

సీతానగరం: మండలంలోని సింగవరం పంచాయతీ పరిధిలోగల నాగరత్నం కాలనీకి చెందిన కోడి వెంకటలక్ష్మి (68) కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ శనివారం రాత్రి 11.30 గంటలకు మృతి చెందిందని హెడ్ కానిస్టేబుల్ గోవిందరాజులు ఆదివారం తెలిపారు. వెంకటలక్ష్మి శనివారం మధ్యాహ్నం ఇంటి వద్ద నిద్రిస్తుండగా ఇంటి పై నుంచి పెంకు తలపై పడి తీవ్ర గాయం అయింది. దాంతో రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, మెరుగైన వైద్యసేవలకు కాకినాడ జీజీహెచ్‌కు రిఫర్ చేశారు. జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ మరణించింది. మృతురాలి కుమారుడు పుష్పారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు

రోడ్డు ప్రమాదంలో దేవదాయ శాఖ ఉద్యోగి..


జోగినాథం (ఫైల్)

కొవ్వూరు: పట్టణంలో ఏబీఎస్ అండ్ పీఆర్ఆర్ కళాశాల సమీపంలో శనివారం అర్ధరాత్రి సంభవించిన రోడ్డు ప్రమాదంలో దేవదాయ శాఖ ఉద్యోగి గండికోట సత్య వెంకట జోగినాథం(35) మృతిచెందారు. ఆయన జంగారెడ్డిగూడెం పారిజాతగిరి వెంకటేశ్వరస్వామి ఆలయంలో రికార్డు అసిస్టెంట్‌గా పని చేస్తున్నారు. కాకినాడలో ఉండే స్నేహితుల్ని కలిసేందుకు విధులు ముగించుకుని బస్సులో జోగినాథం శనివారం రాత్రి రాజమహేంద్రవరం వచ్చారు. కాకినాడ నుంచి స్నేహితులు రాజమహేంద్రవరం వచ్చారు. స్నేహితులతో కొద్ది సేపు కాలక్షేపం చేసి అనంతరం నూతన వస్త్రాలు కొనుక్కొని స్నేహితుడి కారు తీసుకుని జంగారెడ్డిగూడెం బయల్దేరారు. మార్గ మధ్యలో అర్ధ రాత్రి 2.30 గంటల సమయంలో కొవ్వూరు పట్టణ శివారుకి వచ్చేసరికి కుక్క అడ్డు రావడంతో అదుపు తప్పి పక్కనే ఉన్న డివైడర్‌ను ఢీకొట్టారు. దీంతో కారు బోల్తా పడింది. జోగినాథం తలకి బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. ఆయన ఇంకా ఇంటికి రాలేదని తల్లి ఫోన్ చేయడంతో కొవ్వూరు పోలీసులు ప్రమాదం సంభవించిన సమాచారం తెలిపారు. మృతదేహాన్ని కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి తండ్రి శ్రీరామ సూర్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై ఎండీ జుబేర్ తెలిపారు. జోగినాథంకు వివాహం అయిన ఇద్దరు అక్కలు కాకినాడలో స్థిరపడ్డారు. మృతుడు 2009 అటెండర్‌గా విధుల్లో చేరి పదోన్నతిపై రికార్డు అసిస్టెంట్ అయ్యారు. వివాహం కాలేదు.

తరగతి గది.. విజ్ఞాన నిధి

- టీచ్ టూల్‌తో మెరుగైన బోధన
- జిల్లాలో 1,098 మందికి శిక్షణ
- నేటి నుంచి కాకినాడ, తూర్పు గోదావరి జిల్లాల్లో ట్రైనింగ్
- ఈ నెల 18 నుంచి కోనసీమ జిల్లాలో..

జిల్లా	ఎంపికైన అబ్జర్వర్స్
తూర్పుగోదావరి	270
కాకినాడ	405
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ	423

గుణాత్మక విద్యను అభివృద్ధి చేసేందుకు..

ఇంప్రూవ్‌మెంట్ ఆఫ్ క్వాలిటీ లెర్నింగ్ (గుణాత్మక విద్య) లక్ష్యంగా సాల్ట్ ప్రోగ్రామ్‌ను రూపొందించారు. ఉపాధ్యాయుల బోధనా పద్ధతులు ఎలా ఉన్నాయి? విద్యార్థి స్థాయికి వెళ్లి బోధన చేస్తున్నారా? ఉపాధ్యాయుడి బోధనను విద్యార్థులు ఏ విధంగా రిసీవ్ చేసుకుంటున్నారు? ఉపాధ్యాయుడు బోధనలో 21వ శతాబ్దపు నైపుణ్యాలను అమలు చేస్తున్నారా? లేదా? తదితర విషయాలను టీచ్ టూల్ ద్వారా సర్టిఫైడ్ అబ్జర్వర్స్ తరగతి గదుల్లో పరిశీలన చేస్తున్నారు.



రాయవరం: తరగతి గదిలో అభ్యసన నైపుణ్యాల మెరుగుదలకు రాష్ట్ర విద్యాశాఖ ఆచరణాత్మక ప్రణాళికతో ముందుకెళ్తోంది. సపోర్టింగ్ ఆంధ్రాస్ లెర్నింగ్ ట్రాన్స్‌ఫర్మేషన్(సాల్ట్) ప్రాజెక్టు నిర్వహణలో భాగంగా రాష్ట్ర విద్యా పరిశోధన మండలి (ఎస్‌సీఈఆర్‌టీ), సమగ్ర శిక్ష సంయుక్త ఆధ్వర్యంలో టీచ్ టూల్ పేరుతో ప్రధానోపాధ్యాయులు/స్కూల్ అసిస్టెంట్లు/ఎస్‌జీటీ/సీఆర్‌ఎంటీలకు టీచ్ టూల్ అబ్జర్వేషన్‌పై శిక్షణ ఇస్తున్నారు. టీచ్ టూల్ ద్వారా ఉపాధ్యాయుల బోధనా పద్ధతులను అధ్యయనం చేయనున్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఉపాధ్యాయుల వృత్తి నైపుణ్యాలను అభివృద్ధి పర్చేందుకు..అదే సమయంలో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు తెలుసుకునేందుకు ఎస్‌సీఈఆర్‌టీ పలు రకాల పద్ధతులను అధ్యయనం చేస్తోంది. టీచింగ్ సామర్థ్యాలు ఎలా ఉన్నాయి? టీచర్‌కు, విద్యార్థికి మధ్య సంబంధాన్ని తెలుసుకునేందుకు టీచ్ టూల్ అబ్జర్వేషన్స్ ఉపయోగపడుతున్నాయి. పరిశీలనాంశాలను డిజిటల్ బేస్డ్‌గా యాప్‌లో నమోదు చేస్తున్నారు. ప్రపంచ స్థాయి బోధనా పద్ధతులపై 1,098 మందికి మాస్టర్‌ట్రైనీలు అవగాహన కల్పించనున్నారు.

నేటి నుంచి రెండు జిల్లాల్లో..

రాష్ట్ర స్థాయిలో ఉమ్మడి జిల్లా నుంచి శిక్షణ పొందిన 25 మంది మాస్టర్ ట్రైనీలు టీచ్‌టూల్ అబ్జర్వర్స్‌గా ఎంపిక చేసిన వారికి శిక్షణ ఇస్తారు. కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాల్లో సోమవారం నుంచి ఈ నెల 10వ తేదీ వరకు శిక్షణనిస్తుండగా, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ఈ నెల 18 నుంచి 27వ తేదీ వరకు తొమ్మిది రోజుల శిక్షణనిస్తారు. 2022–23 విద్యా సంవత్సరంలో ఉమ్మడి జిల్లాలో కాకినాడ, రాజమహేంద్రవరం, అమలాపురం, రామచంద్రపురం, అన్నవరం, జగ్గంపేటల్లో రెండు బ్యాచ్‌లుగా సర్టిఫైడ్ అబ్జర్వర్స్‌కు శిక్షణ ఇచ్చారు. ఈ విధంగా తూర్పుగోదావరి నుంచి 167, కాకినాడ జిల్లా నుంచి 160, కోనసీమ జిల్లా నుంచి 97 మంది సర్టిఫైడ్ అబ్జర్వర్స్‌గా శిక్షణ పొంది 5,936 తరగతి గదుల్లో ఉపాధ్యాయుల బోధనను టీచ్‌టూల్ యాప్ ద్వారా నమోదు చేశారు. ఒక్కో బ్యాచ్‌లో 45 మందికి తొమ్మిది రోజుల పాటు శిక్షణ ఇచ్చారు. సర్టిఫైడ్ అబ్జర్వర్స్ తరగతి గదుల్లో పరిశీలనా సమయంలో బిహేవియర్స్ స్కిల్స్ ఎలా ఉంటాయి? బిహేవియర్స్ స్కిల్స్‌కు కోడ్స్ ఎలా ఇవ్వాలి? తదితర విషయాలపై శిక్షణ పొందనున్నారు. శిక్షణ అనంతరం అబ్జర్వర్స్ తరగతి గదుల్లో పరిశీలించిన ఫీడ్ బ్యాక్‌ను తీసుకుని యాప్‌లో నమోదు చేస్తారు. నమోదైన అంశాలు యాప్ ద్వారా గుర్తించి, టీచింగ్‌లోని లోటుపాట్లను సరిచేసేందుకు ఎస్‌సీఈఆర్‌టీ, లీడర్‌షిప్ ఫర్ ఈక్విటీ(ఎల్‌ఎఫ్‌ఈ)తో కలిసి సంయుక్తంగా టీచర్ ప్రొఫెషనల్ డెవలప్‌మెంట్(టీపీడీ) కోర్సులు తయారు చేసి టీచర్స్‌కు శిక్షణ ఇస్తారు. రాష్ట్ర విద్యాశాఖతో పాటుగా లీడర్‌షిప్ ఫర్ ఈక్విటీ అనే స్వచ్ఛంధ సంస్థ ప్రతినిధులు ఈ కార్యక్రమంలో భాగస్వాములయ్యారు.

గత విద్యా సంవత్సరంలో 5,936 తరగతి గదుల పరిశీలన

ఉమ్మడి జిల్లా పరిధిలో ఒక్కో సర్టిఫైడ్ అబ్జర్వర్ తరగతి గదుల్లోని ఉపాధ్యాయుల బోధనా పద్ధతులను టీచ్ టూల్స్ ద్వారా పరిశీలన చేశారు. ఈ విధంగా 5,936 ఉపాధ్యాయుల బోధనా పద్ధతులను పరిశీలన చేసి, టీచ్ ఏపీ యాప్‌లో నమోదు చేశారు. అబ్జర్వర్స్ టీచ్ టూల్ నివేదికలను రాష్ట్ర విద్యా పరిశోధనా మండలి(ఎస్ఈసీఆర్‌టీ)కి పంపించారు.

సమర్థంగా అమలు చేస్తాం



టీచ్ టూల్ ప్రోగ్రామ్‌ను సమర్థవంతంగా అమలు చేసేందుకు అవసరమైన అన్ని చర్యలూ తీసుకుంటున్నాం. మొదటగా సర్టిఫైడ్ అబ్జర్వర్స్‌కు పకడ్బందీగా శిక్షణ ఇచ్చేందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశాం. టీచ్ టూల్ అబ్జర్వర్స్‌గా ఎంపికైన వారందరూ కచ్చితంగా శిక్షణ పొందాలి.

– జి.నాగమణి,
పాఠశాల విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్, కాకినాడ

బోధనా పద్ధతుల మెరుగుదలకు..



విద్యార్థికి, ఉపాధ్యాయుడికి మధ్య ఉన్న అభ్యసన పద్ధతుల్లో ఉన్న గ్యాప్‌ను పూడ్చడానికి టీచ్ టూల్ అబ్జర్వేషన్ చక్కని సాధనం. ఉపాధ్యాయుడు వృత్తి నైపుణ్యాల మెరుగుదలకు ఉపకరించే విధంగా టీచ్ టూల్ రూపొందించడం జరిగింది.

– ఆషిక్ అలీబేగ్, సీనియర్ ప్రాజెక్టు అసోసియేట్
ఫర్ లీడర్‌షిప్ ఫర్ ఈక్విటీ, రాజమహేంద్రవరం.

ఇది మేలైన అంశం



విద్యా ప్రమాణాలను పెంపుదలకు టీచ్ టూల్ ప్రోగ్రామ్ మేలైన అంశంగా చెప్పవచ్చు. రెండు దశల్లో ఉపాధ్యాయులకు టీచ్‌టూల్ అబ్జర్వేషన్స్‌పై శిక్షణ ఇవ్వనున్నాం.

– ఎం.కమలకుమారి, డీఈవో,
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా

పోలీసు సార్‌ల బేరసారాలు!

కోడిపందేలపై దాడులు..ఆపై సెటిల్‌మెంట్లు


పందెం కోడి

పెద్దాపురం: పట్టణ, మండల పరిధిలో కోడి పందేలపై నిర్వహించిన దాడులపై కేసులు నమోదు చేయాల్సిన పోలీసులు సెటిల్‌మెంట్లకు పాల్పడుతున్నారనే విమర్శలు జోరుగా వినిపిస్తున్నాయి. కోడి పందేలపై నిర్వహించిన దాడుల్లో పట్టుబడిన ద్విచక్ర వాహనాలు, పందెం కోళ్లు, పందెం రాయుళ్లను పోలీస్ స్టేషన్‌కు తరలిస్తున్నారు. ఆపై కేసులు నమోదు చేయాల్సిన పోలీసులు బేరసారాలకు దిగుతున్నారనే ఆరోపణలొస్తున్నాయి. పెద్దాపురం ఏడీబీ రోడ్డులోని ఓ రైస్ మిల్లు వెనకాల సరుగుడు తోటలో కోడిపందేలు జరుగుతున్నాయన్న సమాచారంతో పెద్దాపురం పోలీసులు దాడులు చేశారు. ఈ దాడిలో ముగ్గురు నిందితులు, నాలుగు ద్విచక్ర వాహనాలు, ఐదు కోళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో బేరసారాలు జరిగి నిందితులను, ద్విచక్ర వాహనాలను వదిలిపెట్టేశారు. సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు రోజున కట్టమూరు గ్రామంలో కోడి పందేలపై దాడులు నిర్వహించి, నలుగురు నిందితులను, ఐదు ద్విచక్రవాహనాలు, నాలుగు కోళ్లను స్వాధీనం చేసుకున్నారు. షరా మామూలే... సెటిల్‌మెంట్.... నిందితులతో పాటు ద్విచక్ర వాహనాలను విడిచి పెట్టేశారు. కోళ్లు మాత్రం పోలీసుల అదుపులోనే. ఈ కోళ్లు ఏమయ్యాయనే ప్రశ్న చక్కర్లు కొడుతోంది. అయితే ఈ దాడుల్లో పట్టుబడిన పందెం కోళ్లను పెద్దాపురం శివారు ఎన్టీఆర్ కాలనీలోని కోళ్ల వ్యాపారులకు ఒక్కొక్క కోడి రూ.ఐదు వేల నుంచి రూ.పది వేలకు విక్రయిస్తున్నారనే ఆరోపణలున్నాయి. పాత పెద్దాపురం, జగ్గంపేటలకు చెందిన హోమ్‌గార్డుల ద్వారా కోళ్ల అమ్మకాలు సాగిస్తున్నట్టు భోగట్టా. అయితే విషయం తెలుసుకున్న జిల్లా పోలీసు యంత్రాంగం దీనిపై దృష్టి సారించింది. పందెం కోళ్ల అక్రమ విక్రయాలపై పోలీసు అధికారుల ఆదేశాలపై స్పెషల్ బ్రాంచ్ పోలీసులు విచారణ జరిపి, జిల్లా అధికారులకు నివేదిక సమర్పించినట్టు విశ్వసనీయ సమాచారం. దీనిపై పెద్దాపురం ఎస్సై సురేష్‌ను వివరణ కోరగా కోళ్ల విక్రయాల అంశం తన దృష్టికి రాలేదన్నారు. తన స్టేషన్ పరిధిలో సెటిల్‌మెంట్లు జరిగే ప్రసక్తి లేదన్నారు. దీనిపై విచారణ చేపట్టి, తగు చర్యలు తీసుకుంటానని చెప్పారు.

సత్యదీక్ష నియమావళి ఆవిష్కరణ

అన్నవరం: శ్రీ వేంకటేశ్వర గోవింద మాల దీక్షా ఫౌండేషన్ (హైదరాబాద్) రూపొందించిన సత్యదీక్ష నియమావళి పుస్తకం సత్యదీక్షలు చేపట్టే భక్తులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నవరం దేవస్థానం ఈఓ కె.రామచంద్రమోహన్ అన్నారు. ఆయన ఆదివారం తన కార్యాలయంలో ఈ పుస్తకాన్ని ఆవిష్కరించి ఫౌండేషన్ సభ్యులను అభినందించారు. పది వేల ప్రతులను ముద్రించి దేవస్థానానికి అందజేసినట్టు శ్రీ వేంకటేశ్వర గోవింద మాల దీక్షా ఫౌండేషన్ అధ్యక్షుడు అల్లం సాయికుమార్ తెలిపారు. ఫౌండేషన్ సభ్యుడు గుంటుకు రామకృష్ణ, ఇతర సభ్యులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

నేడు ఫ్లడ్ కంట్రోల్ రూమ్ ప్రారంభం

ధవళేశ్వరం: వరదల సీజన్ ప్రారంభం కావడంతో సోమవారం నుంచి ధవళేశ్వరంలోని హెడ్ వర్క్స్ కార్యాలయంలో ఫ్లడ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయనున్నారు. వరదలపై ఎప్పటికప్పుడు ఇక్కడి నుంచి పరిస్థితిని సమీక్షిస్తారు. అక్టోబర్ 31వ తేదీ వరకు ఈ ఫ్లడ్ కంట్రోల్ రూమ్ పనిచేస్తుంది. వరదలకు సంబంధించి ఎటువంటి సమాచారం కావాల్సినా ఫ్లడ్ కంట్రోల్ రూమ్ ఫోన్ నంబర్ 0832417066లో సంప్రదించాలని గోదావరి హెడ్ వర్క్స్ డివిజన్ ఈఈ ఆర్.కాశీవిశ్వేశ్వరరావు పేర్కొన్నారు. ఆదివారం ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.50 అడుగులకు చేరింది. గోదావరి డెల్టా కాలువలకు 8,820 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు .ఇందులో తూర్పు డెల్టాకు 3,800 క్యూసెక్కులు, మధ్య డెల్టాకు 2,020 క్యూసెక్కులు, పశ్చిమ డెల్టాకు 3,000 క్యూసెక్కుల నీటిని వదిలారు.

కిక్కిరిసిన అయినవిల్లి

అయినవిల్లి: విఘ్నేశ్వరస్వామి ఆలయం ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. స్వామిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధానార్చకుడు అయినవిల్లి సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో స్వామికి మేలుకొలుపు సేవ, వివిధ పూజలు నిర్వహించారు. వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. స్వామివారి లఘున్యాస, ఏకదశ రుద్రాభిషేకాల్లో 41 మంది, లక్ష్మీ గణపతి హోమంలో 16 మంది భక్త దంపతులు పాల్గొన్నారు. ఒక జంట పంచామృతాభిషేకాల్లో పాల్గొన్నారు. 24 మంది తమ నూతన వాహన పూజలు, ఇరుగురు చిన్నారులకు నామకరణలు, అక్షరాభ్యాసాలు జరిపారు. స్వామివారి అన్నదాన పథకంలో 1,342 మంది ప్రసాదం స్వీకరించారు. స్వామివారికి వివిధ పూజలు, అన్నదాన విరాళాలుగా రూ.2,21,000 ఆదాయం లభించిందని ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు.


విఘ్నేశ్వరస్వామివారి పూజల్లో పాల్గొన్న భక్తదంపతులు

రోడ్డు ప్రమాదంలో తాత, మనువడి మృతి


మాసా వీర్రాజు(ఫైల్)


పాముల ధనుస్సు చంద్ర (ఫైల్)

- నేడు భార్య సంవత్సరీకం
- ఏడాది క్రితమే ఆమె పాముకాటుతో మృతి
- ఇప్పుడు తనూ వెళ్లిపోయారు
- కొవ్వూరులో విషాదఛాయలు


ఘటనా స్థలిలో వీర్రాజు, ధనుస్సు చంద్ర మృతదేహాలు

కొవ్వూరు: ఆరికిరేవుల గ్రామం సమీపంలో పాశలమ్మ గుడి వద్ద ఆదివారం మధ్యాహ్నం మోపెడ్ వాహనాన్ని లారీ ఢీకొట్టిన ప్రమాదంలో తాత,మనువడు మృతిచెందారు. కొవ్వూరు పట్టణంలోని శ్రీరామకాలనీకి చెందిన మాసా వీర్రాజు(48), అతని మనువడు పాముల ధనుస్సు చంద్ర (11) మోటారు సైకిల్‌పై వస్తుండగా లారీ ఢీకొట్టడంతో ఘటనా స్థలంలోనే ప్రాణాలు కోల్పోయారు. ఏడాది క్రితమే వీర్రాజు భార్య నాగమణి పాము కాటు బారిన పడి మృతి చెందింది. దీంతో జూలై ఒకటో తేదీన ఆమె సంవత్సరీకం నిర్వహించాలని నిర్ణయించారు. దీనిలో భాగంగా తన పెద్ద కుమార్తె సునందతో మాట్లాడేందుకు మోపెడ్ వాహనం వేసుకుని ఆదివారం ఉదయం కుమారదేవం వెళ్లాడు. తిరిగి వచ్చేటప్పుడు మనువడు తాతతో కొవ్వూరు వచ్చేందుకు సరదా పడడంతో మోటారు సైకిల్ ఎక్కించుకుని వస్తుండగా మార్గమధ్యలో ప్రమాదం బారిన పడ్డారు. కొవ్వూరు వైపు నుంచి అన్నదేవరపేట వెళుతున్న కాంక్రీటు మిక్సింగ్ లారీ వీరి మోటారు సైకిల్‌ను ఢీకొట్టింది. మృతదేహాలను కొవ్వూరు ప్రభుత్వ సామాజిక ఆసుపత్రి మార్చురీకి తరలించారు. పట్టణ పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు. ధనుస్సు చంద్ర తల్లిదండ్రులకు ఏకైక కుమారుడు. ధనుస్సుకి ఓ సోదరి ఉంది. మృతుడు వీర్రాజు అల్లుడు పాముల సుబ్రహ్మణ్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ వి.జగదీశ్వరరావు తెలిపారు. మృతుడు వీర్రాజుకి ఇద్దరు కుమార్తెలు. ఏడాది క్రితమే భార్య చనిపోగా ఇప్పుడు వీర్రాజు మృతి చెందడం ఆ కుటుంబాన్ని తీవ్రంగా కలచివేసింది. ఈ దుర్ఘటనతో ఇటు కొవ్వూరులోను, అటు కుమారదేవం గ్రామంలోను విషాద ఛాయలు అలముకున్నాయి. .

న్యాయస్థానాల తీర్పులను అమలు పరచండి

రాజమహేంద్రవరం సిటీ: తపాలా శాఖలో ఆర్టీపీ (రిజర్వుడ్ ట్రైన్ పూల్) ఉద్యోగులుగా 1982 నుంచి 1990 వరకు పనిచేసిన కాలాన్ని సర్వీస్‌గా పరిగణలోకి తీసుకుని, అన్ని రకాల ప్రయోజనాలు అందజేయాలని ఉన్నత న్యాయస్థానం తీర్పునిచ్చినప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని ఉభయ రాష్ట్రాల ఆర్టీపీ ఉద్యోగుల పోరాట సమితి కన్వీనర్ వి.రవికృష్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు. కోర్టు తీర్పులను అమలు చేయకుండా అధికారులు వక్రభాష్యాలు చెబుతూ కాలయాపన చేస్తున్నారని అన్నారు. ఆదివారం నగరంలో వై.జంక్షన్ రోటరీ హాలులో ఆర్టీపీ ఉద్యోగుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రవి కృష్ణ మాట్లాడుతూ ఉన్నత న్యాయస్థానాల తీర్పులను త్వరలో అధికారులు అమలు చేయని పక్షంలో ఆర్టీపీ ఉద్యోగులంతా తమ కుటుంబ సభ్యులతో సీపీఎంజీ ఆఫీస్‌ల ఎదుట ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. కోర్టుకు వెళ్లిన 388 ఉద్యోగులలో 40 మంది చనిపోయారని 300 మంది రిటైర్ అయ్యారని కొద్దిమంది మాత్రమే సర్వీసులో ఉన్నారని సీనియర్ సిటిజన్ ఉద్యోగులను తపాలా శాఖ అధికారులు అనేక రకాల ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 25 సంవత్సరాల నుంచి సుదీర్ఘ పోరాటం చేసి విజయం సాధించినా ఫలితం రాలేదన్నారు. హైదరాబాద్ ఆర్టీసీ ఉద్యోగుల సంఘం నాయకుడు ఎస్ఎస్ఎల్ నరసింహం మాట్లాడుతూ ఉన్నత న్యాయస్థానం ఆదేశాలను ఆంధ్రాలో అధికారులు సక్రమంగా అమలు చేయడం లేదని విమర్శించారు. విజయనగరం, ఉభయ గోదావరి జిల్లాల ఉద్యోగులు, ఆర్జె మధుసూదనరావు, టి.పుల్లేశ్వరరావు, సాయిరాం, ఎ.కృష్ణమోహనరావు, కె.ఏడుకొండలు, వై.సన్యాసిరావు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్



■ టీమ్ లీడర్స్,ఎగ్జిక్యూటివ్స్ బ్యాంక్ అనుబంధ సంస్థలో కావలెను. Sal+Inc. జీతం: 40 వేల వ:30-70 yrs Q:10th+ రిటైర్డ్, వ్యాపారస్తులు, RMP డాక్టర్స్, గృహిణులు, ఇన్సూరెన్స్ ఏజెంట్స్‌కు, మార్కెటింగ్‌కు ప్రాధాన్యత ✆ 99666 43511 సాయంత్రం 5 టు 10 గం॥ మాత్రమే ఫోన్ చేయగలరు. [B-139]

GOLD FINANCE



■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) (100% జెన్యూన్) ✆ 91699 22299

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్స్ 3500/- మీ పేరు, అడ్రస్ కాల్/ వాట్సప్ చేయగలరు. 95026 15217 [M-1185232]



■ కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీ/పురుషులు,ఆయా,నర్సులు, వంటవారు, RMP&డాక్టర్స్ కావలెను. జీ: 15000-40000,ఫ్రీ రూమ్+భోజనం.HYD. 8317512135 [HA-315]

■ TATA ACE పై పనిచేయుటకు డ్రైవర్ కావలెను. జీతం : రూ.15,000/- నుండి రూ.18,000/- వరకు Cont: శ్రీదేవి హోండా, అథరైజ్డ్ డీలర్ : హోండా టూ వీలర్స్, టూ టౌన్ పోలీస్ స్టేషన్ దగ్గర, మెయిన్ రోడ్, కాకినాడ. ✆ : 94909 98888. [R-32]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నారుమడి.. ఇలా పెంచితే సరి


నారుమడి


నాట్లు వేస్తున్న కూలీలు

పాడి-పంట

కాకినాడ సిటీ: ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. తొలకరి వర్షాలు కురుస్తుండడం, కాలువల్లో నీరు ఉండడంతో రైతులు నారుమడులను ముందుగానే పోసుకోవాలని వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నారు. జిల్లాలో 90,674 హెక్టార్లలో వరిసాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికే నారుమడులు పోశారు. కొన్నిచోట్ల వెదజల్లు సాగు చేపట్టారు. 10వేల హెక్టార్లలో రైతులు దమ్ములు చేసుకొని విత్తనాలు చల్లే పనిలో ఉండగా కొన్ని ప్రాంతాల్లో వరి నారు వేసుకుంటున్నారు. జిల్లాలో సామర్లకోట మండలంలో రైతులు 90 శాతం మంది వెదజల్లు సాగు చేపట్టనుండగా మిగిలిన ప్రాంతాల్లో 30 శాతం మంది వెదజల్లు సాగు, మిగిలిన 70 శాతం మంది రైతులు వరి నారుతో నాట్లు వేస్తారని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. ఏలేరు కాలువకు సాగునీరు రాకపోవడంతో మెట్ట ప్రాంతంలో ఇంకా వ్యవసాయ పనులు చేపట్టలేదు. కొన్ని ప్రాంతాల్లో వరి నారు వేయగా, మరికొన్ని ప్రాంతాల్లో వరి నారు వేసుకునేందుకు రైతులు సన్నద్ధమవుతున్న నేపథ్యంలో నారుమడి, నాట్లు వేసేటప్పుడు రైతులు మెలకువలు పాటించాలని జిల్లా వ్యవసాయాధికారి ఎన్. విజయకుమార్ సూచిస్తున్నారు.

ఖరీఫ్‌కు అనువైన రకాలు

- ఎంటీయూ 7029 (స్వర్ణ), ఎంటీయూ 1318, ఎంటీయూ 1239, ఎంటీయూ 1224 (మార్టేరు సాంబ), ఎంటీయూ 1262, బీపీటీ 5204 రకాలు సాగుకు అనువైనవి.
- నారుమడిని రెండు,మూడు సార్లు దమ్ము చేసి చదును చేయాలి. నీరు పెట్టడానికి, తీయడానికి వీలుగా నారుమడిలో కాలువలు ఏర్పాటు చేసుకుని ఎత్తు నారు మళ్లను తయారు చేసుకోవాలి. ముందుగా రైతులు కిలో విత్తనాలకు కార్బండిజమ్ ఒక గ్రాము చొప్పున తడి విత్తనానికి కలిపి 12 నుంచి 24 గంటలు నానబెట్టి నారుమడి వేసుకోవాలి.
- నారుపోసే ముందు విత్తన శుద్ధి తప్పనిసరిగా చేయాలి. తడి విత్తన శుద్ధి తప్పనిసరిగా చేయాలి. తడి విత్తన శుద్ధికి కార్బండిజమ్ 1 గ్రాము, పొడి విత్తన శుద్ధికి 3 గ్రాముల మందును కిలో విత్తనానికి చొప్పున కలిసి విత్తుకోవాలి.
- ఎకరం నాటుకోవడానికి ఐదు సెంట్ల మడిలో అతి సన్నగింజ రకాలైతే 15 కిలోలు, సన్నగింజ రకాలైతే 20 కిలోలు, దొడ్డుగింజ రకాలైతే 25 కిలోలు నారు పోసుకోవాలి.
- బెంగాలీ నాట్లయితే 10 నుంచి 15 కిలోల విత్తనం సరిపోతుంది. నారుమడి ఐదు సెంట్లకు 22 కిలోలు యూరియా, 6.25 కిలోల సూపర్, 1.6 కిలోల పొటాష్ వేసుకోవాలి.
- విత్తనం ఒత్తుగా చల్లుకున్నట్టు అయితే నారు పెరుగుదల బలహీనంగా ఉంటుంది.
- విత్తనం పలచగా చల్లాలి.
- మొలక కట్టిన విత్తనాన్ని చల్లి, వారం రోజులు ఆరుతడులు, ఆ తర్వాత మొక్క దశలో పలుచగా నీరు ఉంచాలి.
- జింకు లోప నివారణకు లీటరు నీటికి 2 గ్రాముల జింకు సల్ఫేట్ కలిపిన ద్రావణాన్ని పిచికారీ చేయాలి.
- మెట్ట నారుమడిలో ఇనుపధాతు లోపాన్ని గమనిస్తే సరి చేయాలి. పంట, ఎదుగుదలను బట్టి 2 గ్రాముల నుంచి 5 గ్రాముల అన్నభేది, 0.5 నుంచి ఒక గ్రాము నిమ్మ ఉప్పు లీటరు నీటికి పిచికారీ చేయాలి.
- నాట్లు ఆలస్యమయ్యే పరిస్థితుల్లో రెండో దఫా నత్రజని ఆలస్యంగా వేసి నారు ముదరకుండా చూడాలి.

కలుపు నివారణ

నారుమడిలో ఒకట్రెండు రోజుల్లో ప్రిటిలాక్లోర్ 50 శాతం ఈసీ రెండు మిల్లీలీటర్లు ఒక లీటరు నీటికి కలపాలి. ఎకరాకు 400 మిల్లీలీటర్లు చల్లుకోవాలి. మూడు నుంచి ఐదు రోజుల్లో పైరజోసల్ఫ్యూరాన్ ఇథైల్ 10 శాతం డబ్ల్యూపీ 80 గ్రాములు ఎకరాకు వేసుకోవాలి. 15 నుంచి 20 రోజుల్లో బిస్పైరిబాక్ సోడియం 100 ఎంఎల్ ఎకరాకు పిచికారీ చేసుకోవాలి. అవసరాన్ని బట్టి నారుమడికి సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. నాట్లు వేసిన పొలంలో మూడు నుంచి ఐదు రోజుల్లో పైరజోసల్ఫ్యూరాన్ ఇథైల్ 80 గ్రాముల ఎకరాకు, 15 నుంచి 20 రోజుల్లో సెహాల్ ఫాప్‌బ్యూటైల్ 10 శాతం ఈసీ 400 ఎంఎల్ ఎకరాకు చల్లుకోవాలి.

నాట్లు వేసే ముందు తీసుకోవాల్సిన జాగ్రత్తలు

నాట్లు వేయడానికి 15 రోజులు ముందుగానే దమ్ము చేయాలి. పవర్ టిల్లర్లు లేదా ట్రాక్టర్‌తో 15 సెంటీమీటర్ల లోతున దమ్ము చేసుకోవాలి. ఎరువులు 36-24-24 ఎన్పీకేలు అనగా ఒక ఎకరాకు 80 కిలోల యూరియా మూడు దఫాలుగా, సింగ్ సూపర్‌ఫాస్ఫేటు 150 కిలోలు, 40 కిలోల పొటాష్ రెండు దఫాలుగా నాట్లు వేసిన వరి చేలకు వేయాలి. 20 నుంచి 30 రోజుల నారు ఊడ్చడానికి మంచిది. రెండు, మూడు మొక్కలను రెండు నుంచి మూడు సెంటీమీటర్ల లోతులో వేసుకోవాలి. ప్రతి రెండు మీటర్లకు 20 సెంటీమీటర్ల కాలిబాటలు తీసుకోవాలి. తద్వారా గాలి, వెలుతురు మొక్కకు బాగా తగులుతుంది. పురుగు మందులు చల్లుకోవడానికి కాలిబాటలు బాగా ఉపయోగపడతాయి.

లోతట్టు ప్రాంతాల్లో విత్తన మార్పిడి మంచిది



లోతట్టు ప్రాంత రైతులు స్వర్ణకు బదులుగా ఎంటీయూ 1318 రకం వరి వంగడాన్ని వేసుకోవాలి. జిల్లాలో 10వేల హెక్టార్లలో దమ్ములు అయ్యాయి. రైతులు నారు పోసే పనిలో ఉన్నారు. త్వరితగతిన నారుమడి పోసుకోవాలి. సాగులో సలహాలు, సూచనలకు ఆర్బీకేల్లోని వ్యవసాయ సహాయకులను సంప్రదించాలి.

– ఎన్.విజయకుమార్, జిల్లా వ్యవసాయాధికారి